# మీసాలపై తేనియల్

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

రామారావు రాక గమనించగానే సరళ చరఖా అలాగే వదిలిపెట్టి అతను కాళ్లు కడుక్కునేందుకు నీళ్లు తేవడానికి పెరట్లోకి వెళ్లింది. ఈలోగా రామారావు చేతిలో పొట్లాం, పుస్తకాల షెల్ఫులో పుస్తకాల వెనకాల జాగ్రత్తగా దాచి కోటు గుండీలు విప్పుకుంటున్నాడు

సరళ చెంబూ నీళ్లు తెచ్చేసరికి రామారావు పరధ్యానంగానే ఉన్నాడు. చెంబు అతని కాళ్లకి దగ్గర పెడుతూ ఆమె అంది:

“ఏమిటి చాలా పరధ్యానంగా ఉన్నారు?”

అతను మాటలాడలేదు. అంతర్యాప్తమైన ఏదో మహత్తర సంతోషం అతని ముఖం ద్వారా చిరునవ్వుల చంద్రికల విస్ఫారితం చేస్తూందని సరళ గమనించింది. ఆనందాతిరేకంలో ఊహాలోకాల్లో విహరిస్తూంటే తనెందుకా సుఖ స్వప్నాలను భగ్నం చెయ్యాలి?

టీ తెచ్చి యిచ్చింది మాటలాడకుండానే. రామారావు కప్పు ఖాళీచేసి టేబిల్ మీద పెట్టాడు. సరళ కప్పు తీసుకొని వెళ్లిపోతూంటే హఠాత్తుగా అతను ఆమెని పిల్చాడు. కిలకిల నవ్వుతూ ఆమె వెనక్కి వస్తూ అంది: “మేలుకున్నారు - పాపం!”

రామారావు మరొకప్పుడైతే ఆమెతో తన సంతోషాన్ని నవ్వు ద్వారా మేళవింప జేసి ఉండును. కాని సంతోషాతిశయం దుఃఖాతిశయంలాగే అతని ఆలోచనలని లాక్కొని యింది. మాటలకి అడ్డుపెట్టింది. తన ప్రక్కని నిలువబడి ‘పిల్చారా?’ అనే సరికి అతని దగ్గర జవాబు సిద్ధం లేకపోయింది. లాలనగా ఆమెని ప్రక్కని కూర్చోబెట్టుకుంటూ అతనన్నాడు: “ఏం చేస్తున్నావు?”

ఎంత అర్థం లేని ప్రశ్న! అతనింకా మధుర స్వప్నసీమ పథాలనుంచి నిజప్రపంచానికి రాలేదని ఆమెకి అర్థంలేని ఈ ప్రశ్నే చెప్పింది. అతని చేతిని తన చేతిలోకి తీసుకుని ఆప్యాయంగా నిమురుతూ ఆమె అంది - “మీతో మాట్లాడుతున్నాను”

రామారావు ఒక్కసారి ఈ లోకంలోకి వచ్చాడు. ఆమె హస్తాన్ని ఎందుకో పట్టిపట్టి పరీక్ష చేస్తుండగా వారం క్రిందట అప్పులు తీర్చడం కోసం ఒకనాడు తానామెకి బహుమానం ఇచ్చిన ఉంగరాన్ని వణికే చేతులతో ఏడ్చే మనస్సుతో షాహుకారు ఇచ్చే డబ్బు కోసం వాడి శిలాకఠిన హస్తాలలో పెడుతూన్న దృశ్యం అతని మనోవీధిలో తళుక్కు మన్నట్టు మెరిసి అతని జీవితపు పూర్వఘట్టాలకి ఒక్కసారి అతన్ని తీసుకుపోయింది.

నాడు రామారావు ఒకధనికుడు. సౌఖ్యంగా జీవించడం కోసమే పుట్టిన బహు కొద్దిమంది అదృష్టవంతుల్లో ఒకడు. తండ్రి తనకి అప్పజెప్పిపోయిన పదెకరాల భూమీ, రెండిళ్లూ, రొఖ్ఖం, మొత్తం సుమారు ఇరవై వేలు చేసే ఆస్తి

సరళ! నాలుగు సంవత్సరాల క్రిందట ఆమెకి భర్త అంటే ఒక స్నేహితుడు-కాలక్షేపంకోసం సంఘం ఇచ్చిన ఒక మిత్రుడు. లోక అంటే ఒక తీర్థం. కేవలం సౌఖ్యాల ననుభవించడానికే ఆ తీర్థంలోకి మనుష్యులు రావటం. సిల్కు చీరలూ, పట్టు బట్టలూ కేవలం ధనవంతులే వేసుకుంటారని ఆమెకి తెలీదు. ఆమె ఏ ఎడ్వర్టయిజుమెంటులో చూసినా చక్కని వస్తువులని తెప్పించడానికి ఎంత ఖరీదైనా వెనుతీసేదికాదు. ప్రతిదినం స్వీయ సౌందర్యార్చనకోసం ఎన్నో గంటలు ఉపయోగించేది. రూపాయిలు ఖర్చు చేసేది.

వాళ్ల కారుమట్టుకు అంత మంచిదికాదు. అసలు రామారావులోని మార్పుకి ఈ కారే చాలా ముఖ్యమనాలో లేక కొంత భూమినీ ఒక ఇంటినీ అమ్మి సరళ మూడురోజులు పెట్టి

పంతం ఫలితంగా కొన్న ఫోర్డుకారు ముఖ్యమ సాలో తెలీదు.

కారు కొన్నమాసంలో అల్పాహారవిందులకీ, డ్రైవరుకి అడ్వాన్సుగా ఇచ్చిన మూడునెలల జీతానికీ (అప్పుడు యుద్ధం మూలంగా డ్రైవర్లకి కరువుగానే ఉండేది) అయిదువందలు ఊడి పోయాయి.

కారుకి పెట్రోలుకోసం చాలా అవస్థ పడ వలసి వచ్చేది. మధ్యమధ్య ఆఫీసర్లకి ముట్టచెప్ప కొనే ముడుపులుకూడా తక్కువగా ఉండేవి కావు. పెట్రోలుఖరీదుకూడాఎక్కువగా ఉండేది.

ఇలాగ పది మాసాలు గడిచేసరికి రొఖ్ఖం అయిపోయి ఖర్చులకోసం భూమి అమ్మాల్సిన అవసరం వచ్చింది. మరుసటి సంవత్సరంలో మూడెకరాల మెట్ట తప్ప మిగతా భూమి అయి పోయింది. అప్పటికి మేలుకున్న రామారావు కారు అమ్మేద్దామని అంటే—"ఇంకా సరదా తీరలేదు..." అని మారాం చేసింది సరళ. ఆమె మాటని కాదనడానికి అతనికి ధైర్యంచాలదు.

తరవాత ఒకనాడు సాయంత్రం డ్రైవరుని వదలిపెడదామని డ్రైవింగు నేర్చుకున్న రామా రావు ఒక్కడూ సింహాచలంనించి వస్తున్నాడు. చక్కటికారు-చాలా నిశ్శబ్దంతో పోతూంది దారిలో ఒక ముసిలివాడు కారుక్రింద పడ్డాడు. కారు వంతెనకి గుద్దుకుని పిప్పి అయిపోయింది. రామారావు కారులోంచి బైటికి ఉరకడం వల్ల చిన్న దెబ్బలతో దక్కాడు.

డాక్టరు బిల్లూ, కోర్టుఖర్చులూ, జరిమానా పడ్డ రెండువేల రూపాయలూ, కోసం ఇల్లు తణఖా పెట్టవలసి వచ్చింది—ఆ మూడు ఎక రాలు, బాంకులో ఉన్నదీ చాలక.

మిగిలిన నగలమ్మి ఈ ఇల్లు కొన్నాడు. రామారావు ఒక కంపెనీలో గుమాస్తాగా చేరి కొంత తెస్తున్నాడు. సంసారం అతికష్టంతో సాగుతూంది రెండు సంవత్సరాలనించీ.

సరళ ఇప్పుడు తన తప్పు గ్రహించింది. ఆమె ఇల్లు ఊడ్వడానికి కూడా దాసీని పెట్టుకో నక్కరలేకుండా కాలక్షేపం చేస్తూంది. ఇప్పు డామె సబ్బులు వాడదు- 'చేతులు చాలు పరి శుభ్రతకి' అంటుంది. రామారావు ఆమెలో ఈ మార్పు వచ్చిందని గ్రహించడానికి ఒక్క నెల మాత్రం పట్టింది. తనకి తానేగా పరిచర్య చేసి తన పాపం పోగొట్టుకోడానికి సరళ ప్రయత్నిం చడం అతన్ని హృదయాన్ని కరిగించివేసింది. అతను సరళని తిరిగి మనసారా ప్రేమించడం మొదలుపెట్టాడు.

ఇలాగ గడిచాయి ఈ రెండుసంవత్సరాలూను. ఈ రెండు సంవత్సరాల కాలంలోనూ రామా రావులో ఇంతమార్పు వచ్చింది. నాల్గు నెలల క్రిందటఆఉంగరాన్నమ్ముకునేదుస్థితి వచ్చిందతనికి.

కాని క్రిందటి నెల అతను క్రాస్‌వర్డ్సు పోటీ చేసేడు. అదృష్టం ఎంతసేపు రావాలి! ఇరవై వేల రూపాయలు అతను గెల్చుకున్నట్టు ఈవేళ టెలిగ్రాం వచ్చింది.

డబ్బు తన జీవితంలో తెచ్చిన మార్పు గురించి రామారావుకి ఒకళ్లు చెప్పనక్కరలేదు కాని ఇందాకటినుంచీ అతను ఆలోచిస్తూన్న సరళ విషయమే. ఈ ఇరవై వేలూ వచ్చాక మళ్లా పూర్వపు స్థితికి పోదామని ఆమె అంటుందా?

ఆమె చేతిని తన చేతిలో ఉంచుకొని ఉంగరం ఉండాల్సిన చోటే చూస్తూ అదోలా అన్నాడు. "మనకి క్రాస్‌వర్డ్లో ఇరవై వేల రూపాయిలు లాభం వచ్చాయి సరళా!"

సరళ ఏమీ జవాబివ్వకుండా అధోముఖంగా చూస్తూ ఉండిపోయింది. బహుశా ఆమెకూడా పూర్వపు జీవితాన్ని తల్చుకుని విచారిస్తుందేమో నిశ్శబ్దంగా గడచిన పది సెకండ్లలో ఆమె కంటి నీరు చుక్కలుచుక్కలుగా రాలుతూ రామా రావు చేతిమీద వెచ్చగా పడుతున్నాయి.

రామారావు ఆమెని ఓదారుస్తూ అన్నా "ఆ స్థితిలోకి వచ్చామని విచారిస్తున్నావా?'

సగంలో అందుకుని తీవ్రంగా అంది :

"ఆ డబ్బు మీరు ఇంటికి పట్టుకు తేవద్దు. తణఖాతీర్చి ఆ ఇల్లు అద్దెకివ్వండి. ఇంకా ఏమైనా మిగులుతే ఆ ఉంగరం తీసుకురండి" గాద్గదిక ఆమె మాటలు ముగించి టీ కప్పుతో లోని వెళ్ళి పోయింది.

పుస్తకాల వెనక పెట్టిన సిల్కుచీర సరళ ఎప్పుడూ కట్టుకోలేదు. ఆమెలో కలిగిన పరివర్త నను తాను పూర్తిగా గ్రహించినందుకు గుర్తుగా రామారావు ఆపొట్లం అలాగే వదిలేశాడు.